జగనన్నకు చెబుదాం-స్పందనలో అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

-జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ

విశాలాంధ్ర - కాకినాడ : జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కారించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయం స్పందన సమావేశ మందిరంలో జిల్లాస్థాయి జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేసీ ఇలక్కియ, జెడ్పీ సీఈవో ఎ రమణారెడ్డి, సీపీవో పి. త్రినాథ్, పౌరసరఫరాల డీఎం డి.పుష్పమణి, డీఆర్డీఏ పీడీ కె. శ్రీరమణి, జిల్లా పంచాయతీ అధికారిణి భారతి సౌజన్య, కాకినాడ డీఎల్డీవో పి. నారాయణమూర్తిలతో కలిసి హాజరై జిల్లాలోని చుట్టు పక్కల మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు, విన్నపాలను స్వీకరించారు. ఈ అర్జీలను సత్వరం పరిష్కరించవలసిందిగా ఆయా శాఖల అధికారులను జేసీ ఇలక్కియ ఈ సందర్భంగా ఆదేశాలు జారీ చేసారు. మొత్తం-334 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో అందిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారులకు సంతృప్తి కరమైన పరిష్కారం ఇవ్వాలన్నారు. అర్జీలు రీ ఓపెన్ అయ్యే అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జేసీ ఇలక్కియ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో ఎస్పీ అర్జీల స్వీకరణ

విశాలాంధ్ర - కాకినాడ : ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక "స్పందన" కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పి ఎస్. సతీష్ కుమార్ సోమవారం కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో "స్పందన" కార్యక్రమం నిర్వహించారు. స్పందన కార్యక్రమంలో జిల్లా ఎస్పి ప్రత్యక్షంగా ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖిగా మాట్లాడి, వారి సమస్యలను విని, సమస్యలను సత్వరం పరిష్కరించవలసినదిగా సంబంధిత పోలీస్ అధికారులకు తగు ఆదేశాలను జారీ చేసారు. సోమవారం నిర్వహించిన "స్పందన" కార్యక్రమానికి మొత్తం 70 ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పితో డిటిఆర్‌బి ఇన్‌స్పెక్టర్, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి సమస్యకు సత్వర పరిష్కారం

విశాలాంధ్ర - కాకినాడ : ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చే ప్రతి సమస్యను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను కమిషనర్ స్వీకరించారు. వీటిని సత్వరమే పరిష్కరించాల్సిందిగా కమిషనర్ నాగ నరసింహారావు అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు. ఆర్థికపరమైన, కోర్టు సంబంధ అంశాలు మినహా మిగిలిన సమస్య లను ఎప్పటికప్పుడు నిర్దేశించిన వ్యవధిలో పరిష్కరించి ఆ విషయాన్ని ఫిర్యాదుదారులకు కూడా తెలియజేయాలని కమిషనర్ కోరారు.

డయల్ యువర్ కమిషనర్‌కు అంతరాయం : డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి సోమవారం అంతరాయం కలిగింది. సాంకేతిక పరమైన ఇబ్బంది కారణంగా ఫోన్ పని చేయకపోవడంతో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించలేకపోయారు.

టోల్ ఫ్రీ నెంబర్‌ను సద్వినియోగం చేసుకోండి : డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలతో పాటు ప్రజా ఫిర్యాదులు స్వీకరించేందుకు టోల్ ఫ్రీ నెంబర్‌ను కూడా ఏర్పాటు చేశామని కమిషనర్ నాగ నరసింహారావు చెప్పారు. ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల లోపు టోల్ ఫ్రీ నెంబర్ 1800 4255 990కు కాల్ చేసి స్థానికంగా ఎదుర్కొనే సమస్యలను వివరించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్‌ఈ పి సత్య కుమారి, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఈఈలు మాధవి, వెంకటరావు, ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, డీసీపీ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టిపిఆర్‌ఓ మానే కృష్ణమోహన్, వివిధ విభాగాతిపతులు కార్యక్రమానికి హాజరయ్యారు.

ఆడుదాం ఆంధ్ర విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - రామచంద్రపురం/ కే గంగవరం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజక వర్గంలోని వివిధ మండలాలు పర్యటనలో భాగంగా రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ ఆడుదాం ఆంధ్ర కిట్లు పంపిణీలను పర్యవేక్షించారు. సోమవారం రామచంద్రపురం నియోజకవర్గంలోని ద్రాక్షారం వెళ్లే తాళ్లపాలెం రోడ్డు స్థితి గతులను పరిశీలించారు. అనంతరం అక్కడి నుండి కే గంగవరం చేరుకొని ఆడుదాం ఆంధ్ర సంబంధించి చేపడుతున్న కార్యక్రమాలను పరిశీలించి అమలు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం అయ్యేలా కృషి చేయాలన్నారు ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాజేష్‌కు నేషనల్ ఫెలోషిప్ అవార్డు ప్రదానం

విశాలాంధ్ర - కరప : కృషితో నాస్తి దుర్భిక్షం అనే మాటకు ఎవరైతే కృషి పట్టుదలతో పని చేస్తారో వారి కృషికి, కష్టానికి ఫలితం తప్పని సరిగా దక్కుతుందన్నది పెద్దల మాట. కరప మండలం వేలంగి గ్రామానికి చెందిన సవిలే రాజేష్ అంబేద్కర్ భావజాలాన్ని, అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు గత 15 సంవత్సరాలుగా కృషి చేస్తున్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా మొక్కవోని దీక్షతో ముందుకెళుతూ సోమవారం ఢిల్లీలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ నేషనల్ ఫెలోషిప్ అవార్డు అందుకున్నారు. రచయితగా చిన్న ప్రయత్నం, దళిత చైతన్య దీపికలు, కూలి ఉద్యమ నిర్మాత సాపే అప్పలస్వామి వంటి రచనలు ఆయనకు ఎంతో పేరు ప్రతిష్టలను తెచ్చిపెట్టాయి. ఈ రచనలు చేసినందుకు హైదరాబాద్ రవీంద్రభారతిలో విశ్వ కళా మండలి వారు ట్రూ ఇండియన్ అనే అవార్డును ప్రదానం చేశారు. యానం గ్రామవాసి రచయిత, ప్రముఖ జర్నలిస్ట్, పునుగుమట్ల విష్ణుమూర్తి అవార్డు ప్రధానంగా పాల్గొన్నారు. అంబేద్కర్ చేసిన కులాల అభివృద్ధికి రాజేష్ తన రచనల ద్వారా ప్రజల్లోకి తీసుకువెళ్లి చైతన్యం తీసుకువచ్చారని పలువురు వత్తలు కొనియాడారు. ఈ సందర్భంగా కడప మండల అంబేద్కర్ యువజన సేవా సంఘం అధ్యక్షులు చిన్న వెంకటేశ్వరరావు, మాతా అప్పారావు, సాదే వీరరాఘవులు, యువజన సేవా సంఘం సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు.

రేషన్ బియ్యంతో పాటు కందిపప్పు, పంచదార సరఫరా చేయాలి

విశాలాంధ్ర-కొవ్వూరు : జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజలను అడుగడుగునా మోసం చేస్తున్నదని జనసేన ఇన్‌చార్జి టీవీ రామారావు అన్నారు. కొవ్వూరు రెండవ వార్డులో ఇంటింటికి జనసేన కార్యక్రమంలో భాగంగా తిరుగుతుండగా రేషన్ పంపిణీ వాహనం వచ్చింది. వాహనం ద్వారా ప్రజలకు ఇస్తున్న సరుకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేవలం బియ్యం తప్ప ఏ విధమైన నిత్యావసర సరుకులు వాహనంలో పంపిణీ చేయడం లేదు. నాణ్యమైన సన్న బియ్యం సరఫరా అంటూ రేషన్ వాహనాలపై ప్రకటన బోర్డులు తప్ప ఇచ్చేవి దొడ్డు బియ్యం అని వినియోగదారులు తెలిపారు. కందిపప్పు, పంచదార వంటివి కూడా సరఫరా చేయాలని రామారావు డిమాండ్ చేశారు.

డిపాజిట్ల సొమ్మును బాధితులకు చెల్లించాలి

- అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికై ప్రజా ప్రతినిధులు స్పందించాలి
- 18న జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే మహాధర్నాకు బాధితులు తరలి రండి
- సీపీఐ పిలుపు

విశాలాంధ్ర - కాకినాడ : అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కాకినాడలో స్థానిక ఇంద్రపాలెం విగ్రహం వద్ద సత్యాగ్రహ దీక్ష ప్రారంభమైంది. ఈ దీక్షకు ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, ఏజెంట్స్ బాధితులకు దండలు వేసి ప్రారంభించారు. దీక్షలో పాల్గొన్న అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు కె శ్రీనివాస్ మాట్లాడుతూ అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నాలుగో తేదీ నుండి 11వ తేదీ వరకు నియోజకవర్గాల్లో సత్యాగ్రహ దీక్షలు చేయాలని పిలుపునిచ్చారని ఈ పిలుపులో భాగంగా కాకినాడ జిల్లాల్లో సోమవారం సత్యాగ్రహ దీక్ష చేస్తున్నామని, డిసెంబర్ 18వ తేదీన కాకినాడ జిల్లా వ్యాప్తంగా కలెక్టరేట్ కార్యాలయం వద్ద మహా ధర్నా జరుగుతుందన్నారు. 28, 29 తేదీలలో ఆత్మహత్యలు, సహజ మరణాలు గుండెపోటుతో మరణించిన బాధిత కుటుంబాలతో విజయవాడలో 30 గంటల విమోచన దీక్షలు చేస్తున్నామని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ భవిష్యత్ కార్యక్రమం ఏజెంట్స్, బాధితులందరూ పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కే బోడకొండ, తోకల ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అగ్రిగోల్డ్ ఆస్తులు స్వాధీన పరచుకొని బాధితులకు డిపాజిట్లు రూపంలో ఉన్న సొమ్మును తక్షణమే చెల్లించాలన్నారు. అగ్రిగోల్డ్ బాధితులు తమ పిల్లల చదువు, భవిష్యత్తు కోసం, ఆడ పిల్లల పెళ్లి కోసం, ఇల్లు నిర్మాణం కోసం రూపాయి రూపాయి దాచుకున్న సొమ్ము వస్తుందో రాదో మానసికక్షోభతో, మనోవేదనతో, ఆర్థిక ఇబ్బందు లతో, అప్పులు ఊబిలో కూరుకు పోయిన కుటుం బాలను రాష్ట్ర ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితుల డిపాజిట్ సొమ్మును చెల్లించి ఆదుకోవాలని, ఆత్మహత్యలు చేసుకున్న బాధిత కుటుం బాలకు 10 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తలపెట్టిన భవిష్యత్ కార్యక్రమం బాధితుల కుటుంబాలతో 18వ తేదీన చల్లో కలెక్టరేట్‌కు తరలి రావాలని, ఈ పోరాటంలో ప్రజలు భాగస్వాములవ్వాలని, ఈ ఉద్యమానికి భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ సంపూర్ణ మద్దతు ఉంటుందని వారు అన్నారు.

ఈ కార్యక్రమంలో శేఖర్, వైకే. రాజు, కె.పాల్, బాబి, మోహన్ ప్రసాద్, వీర్రాజు, రాజేశ్వరి, వీర వేణి, ఏజెంట్లు, బాధితులు పాల్గొన్నారు.

నాదెండ్ల మనోహర్ అరెస్టుకు నిరసన

విశాలాంధ్ర - కాకినాడ : సోమవారం వైజాగ్‌లో మూసివేసిన టైకున్ సెంటర్‌ని సందర్శించి కార్యక్రమంలో భాగంగా జనసేన పార్టీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, ఉమ్మడి శాసన సభాపతి నాదెండ్ల మనోహర్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన సందర్భంగా కాకినాడ సిటీలో జనసేన పార్టీ రాష్ట్ర సమితి కార్యదర్శి వాసిరెడ్డి శివ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వాసిరెడ్డి శివ మీడియాతో మాట్లాడుతూ 151 సీట్లతో గెలిచిన జగన్మోహన్ రెడ్డి ప్రజలకు మేలు చేయక పోగా ప్రతి సందర్భంలోనూ ప్రజాస్వామ్యంగా శాంతియుతంగా చేస్తున్న కార్యక్రమాల్ని పోలీసులతో అరెస్టు చేయడం చాలా దురదృష్ట కరమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తలాటం సత్యం నాయకులు, ఆకుల శ్రీనివాస్, బద్రి, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

విశాలాంధ్ర -దేవరపల్లి: గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గోపాలపురం టిడిపి ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట రాజు అన్నారు. దేవరపల్లి మండలం గౌరీపట్నంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అండ్ అనిల్ గృహం వద్ద సోమవారం గ్రామ టిడిపి కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటరాజు మాట్లాడుతూ ఎన్నికల సమయం దగ్గర పడిందని పార్టీ విజయానికి ప్రతి నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. మండల టిడిపి అధ్యక్షుడు అనిల్, గౌరీపట్నం గ్రామ టిడిపి అధ్యక్షుడు కోటారు ధ్రువకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర-దేవరపల్లి: పేద, బడుగు వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని దేవరపల్లి ఎంపీపీ దుర్గారావు అన్నారు. దేవరపల్లి మండలం రామన్నపాలెంలో ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ కేవీకే దుర్గారావు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అనేక కార్యక్రమాల చేపట్టినట్టు తెలిపారు. గ్రామాల్లో సచివాలయం ఏర్పాటు, శాశ్వత సిబ్బందిని ఏర్పాటు చేసి వాలంటీర్ల ద్వారా ప్రభుత్వం పెట్టే సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. రామన్నపాలెం గ్రామానికి వివిధ పథకాల ద్వార 13 కోట్ల 38 లక్షల 75 వేల రూపాయలు అభివృద్ధి చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం ఏఎంసి చైర్మన్ రావ్, మండల వైసీపీ అధ్యక్షుడు సతీష్, సర్పంచ్ కూచిపూడి బుల్లరావు తదితరులు పాల్గొన్నారు.

హెూంమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ఏఎంసీ చైర్ పర్సన్

విశాలాంధ్ర-కొవ్వూరు : రాష్ట్ర హెూం మరియు విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనితను కొవ్వూరుకు ఏఎంసీ చైర్ పర్సన్‌గా నూతనంగా ఎన్నికైన ఉప్పులూరి విజయలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. హెూంమంత్రి వారి క్యాంపు కార్యాలయంలో మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నియామక పత్రాలను హెూం మంత్రి చేతులు మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టనున్న విజయలక్ష్మికి హెూంమంత్రి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు .

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే స్పందన

విశాలాంధ్ర - పెద్దాపురం : ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రతీ వారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పెద్దాపురం ఆర్డీఓ జె. సీతారామారావు అన్నారు. వారం వారం నిర్వహించే స్పందనలో భాగంగా డివిజన్‌లో ఆయా మండలాల నుంచి ఈ సోమవారం 16 అర్జీలు అందినట్లు ఆర్డీఓ తెలిపారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ స్పందనలో వచ్చే ప్రతీ అర్జీ సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. స్పందనలో వచ్చే ప్రతీ అర్జీని పరిష్కరించాల్సిన బాధ్యత సంబంధిత శాఖాధికారిపై ఉంటుందన్నారు. డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతీ అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కంచరిందేకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఈ వారం నిర్వహించిన స్పందనకు పట్టణ పరిధిలోని పరిశ్రమల వల్ల వచ్చే కాలుష్య నివారణ చేపట్టాలని. భూమి రీ సర్వే చేయాలని, ఆక్రమణకు గురైన స్థలాలను కాపాడాలని, పట్టాదారు పాసుబుక్‌లో పేర్లు మారాయని, తదితర సమస్యలపై ఫిర్యాదులు అందాయన్నారు. ఆయా అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశించడం జరిగిందని ఆర్డీఓ సీతారామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం డిఎల్పీఓ బాలామణి మున్సిపల్ మేనేజర్ యు జ్యోతిరాణి, ఆర్డీఓ కార్యాలయ డిటీ భానుకుమార్ తదితరులున్నారు.

చిన్నారుల సంరక్షణకు మిషన్ ఇంద్రధనస్సు

విశాలాంధ్ర - ఆలమూరు : చిన్నారుల సంరక్షణ కోసం ప్రభుత్వం మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమాన్ని చేపట్టిందని కొత్తపేట ఎడిషనల్ డిఎంహెచ్‌ఓ ఎం సుమలత అన్నారు. జిల్లా వైద్యారోగ్య ఆదేశాల మేరకు పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల పరిధిలోని పినపళ్ల, జొన్నాడ, గుమ్మిలేరు గ్రామాల్లో వైద్యారోగ్యశాఖ సోమవారం చిన్నారు లకు ప్రత్యేక టీకాల శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్యాధికారులు పి. భవానీశంకర్, ఆర్ మల్లిఖార్జున్, డి. సువర్చలాదేవి, డి. సాయి కిషోర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈశిబిరాలను ఎడిషనల్ డీఎంహెచ్‌ఓ సుమలత పరిశీలించారు. చిన్నారులకు ఏవిధమైన అంటువ్యాధులు దరిచేర కుండా ప్రాణాపాయస్థితి నుంచి కాపాడేందుకు వీలుగా ధనుర్వాతం, కామెర్లు, క్షయ, ఫోలియో, డిప్తిరియా, కోరింత దగ్గు నివారణకు పెంటావాలెంట్, ఎంఆర్, టీటీ, డీపీటీ, హైపటైటీస్ బీ వ్యాక్సిన్లను నిర్ణీత సమయాల్లో అందించాలని సూచించారు. ఈటీకాల ప్రక్రియను సీహెచ్‌ఓ పి. రాధాకృష్ణ, ఎంపీహెచ్‌ఈఓ కె జ్యోతికుమార్, హెచ్‌ఈలు బి. సూర్యనారాయణ ఏవివి రాజా అక్కుల పర్యవేక్షించారు. సూపర్‌వైజర్లు ఎం. శ్రీనివాసరావు, పి. శివప్రసాద్, పి. ఉమ, ఆర్ బాలామణి ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎముకల సాంద్రతపై మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట విజన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆసుపత్రి సామాజిక సేవ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం ఎముకల సాంద్రత, నరాల పనితీరుపై ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సామర్లకోట అన్నపూర్ణ కళ్యాణ మండపంలో విజన్ ఆసుపత్రి ఎండీ ప్రజా వైద్యులు డా మహెూన్నత్ ఆధ్వర్యంలో ఈ మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించగా సుమారు 3వందల మందికి పైగా ఉచిత వైద్యసేవలు పొందారు. ఈ సందర్భంగా ప్రజా వైద్యులు డాక్టర్ మహెూన్నత్ మాట్లాడుతూ ఎంతో అరుదుగా నిర్వహించే ఎముకల సాంద్రత పరీక్షలు శిబిరాలను ప్రజలు ఉపయో గించుకుని రూ.12 వేలు విలువగల ఎముకల సాంద్రతపై, న్యూరోపతి స్క్రీనింగ్ టెస్ట్‌లను కూడా ఉచితంగా పొందే అవకాశాన్ని కల్పించినట్లు చెప్పారు. కాగా ఈ శిభిరంలో దృష్టి ఐకేర్ ఎండి డాక్టర్ మాధురి, డాక్టర్ రవి, సాంకేతిక నిపుణులు, ఆసుపత్రి సిబ్బంది ఈ శిబిరంలో పాల్గొని సేవలందించారు.

ప్రజలందరికీ మేలు చేసే ముఖ్యమంత్రి జగన్

విశాలాంధ్ర - జగ్గంపేట : ప్రజలందరికీ మేలు చేసే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటి బాబు అన్నారు. జగ్గంపేట మండలం రాజపూడిలో సోమవారం నిర్వహించిన జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. తొలుతగా సచివాలయం వద్ద గ్రామంలోని లబ్ధిదారులకు అందించిన పథకాల వివరాలను తెలిపే బోర్డును ఎమ్మెల్యే ఆవిష్కరించారు. తదుపరి వైసిపి పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బూసాల విష్ణుమూర్తి, మార్కెట్ కమిటి ఛైర్మన్ జనప రెడ్డి బాబు, వైసిపి నాయకులు ఒమ్మి రఘురామ్, బిసి గాండ్ల తెలికుల కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యురి నాని, తదితర నాయకులు, ఎంపిడిఓ వసంత్ కుమార్, తదితర అధికారులు పాల్గొన్నారు.

నాదెండ్ల అరెస్ట్‌కు నిరసనగా ధర్నా

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం గడియార స్తంభం సెంటర్లో జనసేన నాయకులు, కార్యకర్తల ఆందోళన నిర్వహించారు. విశాఖపట్నంలో జనసేన పార్టీ పీఏసీ సభ్యుడు నాదెండ్ల మనోహర్ అరెస్టుకు నిరసనగా ధర్నా విశాఖపట్నంలో వైసీపీ నాయకులు రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం టైకున్ జంక్షన్ మూసివేయడం అప్రజాస్వామికం అన్నారు. అమలాపురం జనసేన అసెంబ్లీ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు, నాదెండ్ల మనోహర్ పాటు నాగపట్నం జనసేన నాయకులు, కార్యకర్తలు అరెస్టు చేయడం హేయమైన చర్య అన్నారు.

కిర్లంపూడి శివాలయం వద్ద భారీ అన్నదానం

విశాలాంధ్ర - కిర్లంపూడి : మండల కేంద్రమైన కిర్లంపూడిలో వేంచేసియున్న శ్రీ ఉమా వైద్యనాథేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాసం ఆఖరి సోమవారాన్ని పురస్కరించుకుని స్వామివారికి ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్తీక మాసం ఆఖరి సోమవారం కావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడటమే కాకుండా శివనామ స్మరణతో మార్మోగింది. శ్రీ శత చండి మహా రుద్రయాగ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ వద్ద భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రుద్రయాగ కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

తుపాను బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వ వైఫల్యం

విశాలాంధ్ర - అమలాపురం : ఒక ప్రక్క కరువు, మరోప్రక్క తుపానుతో రాష్ట్రంలో వ్యవసాయ రంగం కుదేలైందని, వెంటనే జాతీయ విపత్తుగా ప్రకటించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి సత్తిబాబు డిమాండ్ చేశారు. యాళ్ళ బ్రహ్మానందం అధ్యక్షతన అమలాపురం కాపు కళ్యాణ మండపంలో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతన్నను కనుపాపలా కాపాడవలసిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ జడత్వాన్ని కదిలించి రైతు కన్నీరు తుడిచేందుకు ఈ నెల 14న అఖిలపక్షం ఆధ్వర్యంలో ఛలో కలెక్టరేట్ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో దేశినీడీ ఉదయ భాస్కర రావు(కాంగ్రెస్ జిల్లా కిసాన్ విభాగం అధ్యక్షుడు), పీతల రామచంద్రా రావు(సిపిఎం కౌలు రైతుల సంఘం), వంటెద్దు బాబీ(కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు), కుడిపూడి శ్రీనివాస రావు (కాంగ్రెస్ జిల్లా విభాగం అధ్యక్షులు), శీలం వెంకటేష్ (బికెఎంయు జిల్లా అధ్యక్షులు), లింగోలు పండు (జనసేన), పోలిశెట్టి బాబులు (జనసేన రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి), కామిశెట్టి నాగబాబు (సీపీఐ జిల్లా కౌన్సిల్), వనచర్ల విజయ కుమార్ (ఎఐకెయస్ జిల్లా ఉపాధ్యక్షులు), బాసర్ల రామకృష్ణ (టీడీపీ పట్టణ కార్యదర్శి), బట్టు పండు (జనసేన పార్టీ)లు హాజరై మాట్లాడారు. ఒక ప్రక్క వర్షాభావం వల్ల రాష్ట్రంలో పంటలు ఎండి పోయి కరువు రక్కసి విలయ తాండవం చేస్తే ప్రభుత్వం నామ మాత్రం మండలాలే ప్రకటించిందన్నారు. దీనికి తోడు మిఛౌంగ్ తుఫాన్ రాష్ట్రం అంతటా అతలా కుతలం చేసిందని ఇంతటి విపత్కర పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుని ఉంటే నూర్పుల్లో ధాన్యం రైతుకు దక్కేదని అన్నారు. 14వ తేదీ కలెక్టర్ కార్యాలయానికి అఖిలపక్ష రాజకీయ పార్టీలు. రైతులు, వ్యవసాయ కార్మిక సంఘాలు, వారు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని సమావేశం తీర్మానించింది.

అర్హులందరికీ సంక్షేమ పథకాలందించడమే సీఎం ధ్యేయం

విశాలాంధ్ర - అనపర్తి : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలనే సంకల్పం తోనే సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మార్కండేయ పురం, ఎన్టీఆర్ కాలనీ ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు పూలమాలలు, హారతులతో ఎమ్మెల్యే కి ఘన స్వాగతం పలికారు. జగనన్న ప్రభుత్వంలో అందించిన ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే సత్తి వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్, పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు), పార్టీ పట్టణ అధ్యక్షులు నల్లమిల్లి మురళీమోహన్ బాలకృష్ణారెడ్డి,పార్టీ జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షులు సత్తి శ్రీనివాసరెడ్డి (ఎస్ ఎస్)సర్పంచ్ వారా కుమారి, ఉప సర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనం కోసం జనసేన

విశాలాంధ్ర - సీతానగరం: జనం కోసం జనసేన అంటూ బత్తుల పాదయాత్ర. మండలంలో గల రఘుదేవపురం గ్రామంలో రాజానగరం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో బత్తుల వెంకటలక్ష్మి, ప్రత్యూష దేవి నిర్వహించారు. దీనిలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ జనసేన చేయబోవు మంచి పనులను వివరించారు. ఈ సందర్భంగా బత్తుల వెంకటలక్ష్మి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో జనసేన పార్టీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ విజయ్ శంకర్, మట్టా వెంకటేశ్వరరావు, నన్నజి, యేసు పాదం, సత్తిబాబు, దులం కృష్ణా, సత్యనారాయణ, దాసరి రమేష్ మొదలగు జనసేన నాయకులు, వీర మహిళలు, జన సైనికులు పాల్గొన్నారు.

మా భూములు మాకు ఇప్పించండి

విశాలాంధ్ర - గోపాలపురం : భూ కబ్జాదారుల చేతుల్లో నుండి తమ పట్టాభూములు తమకు ఇప్పించండి మహా ప్రభో అంటూ లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం గోపాలపురం లోని మండల తహసీల్దార్ కార్యాల యం వద్ద పట్టాదారులు శాంతియుత రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఏఎంసీ డైరెక్టర్, ఎస్సీ ఎస్టీ మానిటింగ్ కమిటీ నెంబరు, సాలివేణు, వైసీపీ ఎస్సీ సెల్ నాయకులు కొడవటి బుజ్జిబాబు, వైసిపి నాయకులు కాకులపాటి శ్రీను మాట్లాడుతూ మండలంలోని బీమోలు గ్రామంలో 346.25 ఎకరాల ల్యాండ్ సీలింగ్ ప్రభుత్వభూమిలో 140 మంది పట్టాదారులు ఉన్నారని, ఆ భూమిని కైంకర్యం చేయడానికి కొంతమంది ఆక్రమణదారులు బినామి కౌలుదారులను ఏర్పాటుచేసి పట్టాదారులకు అన్యాయం చేస్తూ 12 వందల కోట్ల రూపాయల విలువ చేసే భీమోలు లేండ్ సీలింగ్ భూములు పెత్తం దారుల చేతుల్లోకి వెళ్లిందని సాలి.వేణు అన్నారు. 1973లో భూసంస్కరణ చట్టం ద్వారా .ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కుటుంబాల వారికి భూములు ప్రభుత్వం 1976 లోనే పట్టాలు పంపిణీ చేశారు. పట్టాదారులు సాగులో ఉన్నారు. పెత్తందారుల నేతృత్వంలో భూకబ్జా జరుగుతుందని లబ్ధిదారులైన పట్టాదారులకు, సరైన న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాకు లపాటి. వెంకట్రావు, పెనుమాక. సుబ్బారావు, కొడమంచిలి రమణ, ఉప్పలపాటి మోహన్, వేముల రామారావు, కాకులపాటి పెద్ద శ్రీను, ఈ ర్లగడ్డ నరేంద్ర, వేములూరి, దుర్గమ్మ, కాకులపాటి సీతయ్య ,కడిమి చిట్టెమ్మ ,తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమాన్ని అందించిన ఏకైక ప్రభుత్వం

విశాలాంధ్ర - సీతానగరం: గడప గడపకు సంక్షేమాన్ని అందించిన ఏకైక ప్రభుత్వం వైసీపీ అని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని రఘుదేవపురం గ్రామంలో సోమవారం రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మహిళలు హారతులు ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలో ఎస్‌సి పేటలో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు వాటి అమలును వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ మునుపెన్నడూ లేని విధంగా నేరుగా సంక్షేమ పథకాలు లబ్ధిదారుల ఖాతాలోకి వేసిన ఏకైక ప్రభుత్వం వైసీపీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, సర్పంచ్ చంద్రలీల, కన్వీనర్ గంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరీ హరిబాబు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు డాక్టర్ బాబు, జి. త్రిమూర్తులు, పిండి రాధాకృష్ణ, వలవల వెంకటరాజు, నాని మొదలగు వైసీపీ, నాయకులు, కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

సుంకర సుధకు ఎమ్మెల్యే పర్వత పరామర్శ

విశాలాంధ్ర - అమలాపురం : పితృ వియోగంతో బాధపడుతున్న పట్టణ వైసిపి యువ నాయకుడు సుంకర సుధాకర్ (సుధ)ను సోమవారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ పరామర్శించి ఓదార్చారు. సుంకర సుధ తండ్రి సుంకర సత్యనారాయణ ఇటీవల మరణించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణ చంద్ర ప్రసాద్ సోమవారం అమలాపురంలోని సుంకర సుధ ఇంటికి వెళ్లి సుంకర సత్యనారాయణ చిత్రపటానికి నివాళులు అర్పించారు.

మండవల్లి పీహెచ్‌సీ 24 గంటలు పని చేయాలి

విశాలాంధ్ర-మండవల్లి: వైద్యులున్నా రాత్రి వేళ కాపలాదారుడు లేకపోవటంతో మండవల్లి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిమిత వేళల్లోనే పనిచేస్తున్నదని, 24 గంటలు పాటు పనిచేసేలాగా చర్యలు తీసుకోవాలని ఐక్యవేదిక నాయకులు సోమవారం మండల రెవిన్యూ అధికారి కె.రాజ్‌కుమారుకు స్పందన కార్యక్రమంలో అర్జీ అందించారు.ఈసందర్భంగా ఐక్యవేదిక నాయకులు ఎల్ఎస్ భాస్కరరావు, తెంటు అప్పారావు, బండి రంగారావులు మాట్లాడుతూ మండలంలో 65 వేలు జనాభా ఉన్నా ఒక్కటే ఆరోగ్యకేంద్రం ఉందని ఇటీవలి రెండవ పిహెచ్‌సి తక్కెళ్లపాడులో ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. మండవల్లి పిహెచ్‌సిలో 24 గంటలు వైద్యసేవలు అందాల్సి ఉండగా కాపలాదారుడు లేకపోవటంతో ఉదయం 8 నుండి రాత్రి 8 వరకు మాత్రమే పనిచేస్తుందని రాత్రివేళల్లో,అత్యవసర సమ యాల్లో రోగులు ప్రవేటు వైద్యశాలకు పరుగులు పెట్టాల్సి వస్తూందని పేర్కొన్నారు.నైట్‌వాచ్‌మెన్‌ను నియమించి ఆసుపత్రి 24 గంటలు పని చేసేలాగా చర్యలు తీసుకోవాలని ఐక్యవేదిక నాయకులు కోరారు.

పాల ఉత్పత్తిదారుల ఆర్థిక అభ్యున్నతికి కృషి

విశాలాంధ్ర-ముదినేపల్లి : పాల ఉత్పత్తిదారుల ఆర్థిక అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. మండలంలోని వైవాక, ఊటుకూరు పాల ఉత్పత్తిదారుల సొసైటీల్లో వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారులకు మేలు రకమైన పశువుల దాణా , మెరుగైన పోషణ యాజమాన్య పద్ధతులు సూచించారు. పాల రైతులకు మిల్క్ యూనియన్ అనేక సంక్షేమ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రతి నాలుగు నెలలకు 10శాతం చొప్పున బోనస్ పంపిణీ చేయడం జరుగుతుంద న్నారు. క్షీరబంధు , కళ్యాణమస్తు వంటి పథకాలతో పాటు పశువులకు ఉచితంగా వైద్య శిబిరాలు 20శాతం ప్రోటీన్ దాణా పశువుల కృత్రిమ గర్భోత్పత్తి సేవలు కేవలం రూ .50 కు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూనియన్ పాలకవర్గ సభ్యులు అర్జ వెంకట నగేష్ , గుడ్లవల్లేరు పాలశీతలీకరణ మేనేజర్ తోట సత్యనారాయణ , అసోసియేటెడ్ అధ్యక్షులు మంగమ్మ, చింత వెంకటేశ్వరరావు , కట్టా వెంకటమూర్తి, ఆల్ల కొత్త నాగేంద్రబాబు, సర్పంచ్ సూదాబత్తుల శ్రీనివాసరావు, పాల రైతులు పాల్గొన్నారు.

నాదెండ్లను పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గం

విశాలాంధ్ర- ఉంగుటూరు : ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీసేందుకు వెళుతున్న జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ ను విశాఖలోని నోవాటల్ హెూటల్ వద్ద పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గ చర్య అని ఉంగుటూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. సోమవారం ఉంగుటూరు జనసేన పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధర్మరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని వైసీపీ ప్రభుత్వం ఖూనీ చేస్తున్నదన్నారు. రాష్ట్రంలో అభివృద్ధిని దూరం చేస్తూ, అరాచకాలు, దౌర్జన్యాలను పెంచి పోషిస్తూ, ప్రజల గొంతు నొక్కుతూ, ప్రతిపక్ష పార్టీలను అంతమొదించేందుకు సీఎం జగన్ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అల్లకల్లోలం సృష్టిస్తూ ప్రజలను ప్రభు త్వం భయభ్రాంతులకు గురిచేస్తున్నదన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని ధర్మరాజు అన్నారు.

ఆటో రిక్షాల కొనుగోలుకు ఎస్‌సి, ఎస్‌టి మహిళలకు ప్రోత్సాహం

విశాలాంధ్ర-భీమవరం: ఎస్‌సి, ఎస్‌టి మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సర్ఫ్ ఉన్నతి-మహిళాశక్తి అనే ప్రత్యేక పథకం ద్వారా వారి జీవనోపాధికి సున్నా వడ్డీకే ఆటో రిక్షాలు అందిస్తోందని, అర్హులు అయిన వారు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎస్. రామ్ సుందర్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో జిల్లాలో ఎస్ సి, ఎస్ టి మహిళలు 6గురికి 0 వడ్డీకే ఆటో రిక్షాలను అందజేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ సి, ఎస్ టి ల మహిళల జీవనోపాధికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఉన్నతి - మహిళాశక్తి పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. మహిళల జీవనోపాధికి ఇది ఎంతో దోహదపడుతుందన్నారు. ఆటో నడుపుకోవడం ద్వారా రోజు ఆదాయం పొంది సమాజంలో గౌరవంగా జీవించి ఆర్థికాభివృద్ధి సాధించేందుకు వీలుంటుందన్నారు. ఆటో కొనుగోలు సమయంలో లబ్ది దారులు 10 శాతం వాటా ధనాన్ని ఖాతాలో జమచేస్తే మిగిలిన 90 శాతం వడ్డీలేని రుణంగా అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వార్డు,గ్రామ సచివాలయాలు అధికారి కెసిహెచ్ అప్పారావు, డీఆర్డీఏ ఇన్‌చార్జి పిడి వై యస్ యస్ ప్రసాద యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీతోనే రాష్ట్రం అభివృద్ధి

విశాలాంధ్ర-ఉండి: రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే బడుగు, బలహీన వర్గాలు ఆర్థిక అభివృద్ధి సాధించాలంటే వైసిపి తోనే సాధ్యం అని డిసిసిబి చైర్మన్, ఉండి వైకాపా ఇన్‌చార్జి పివిఎల్ నరసింహ రాజు అన్నారు. సోమవారం ఉండి మండలం ఎండగండి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమంలో నరసింహరాజు పాల్గొని పథకాల పట్టికను, పార్టీ జెండాని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి లేకుండా సంక్షేమ ఫలాలు అందాలంటే జగన్ కావాలని నియోజకవర్గంలో ఉన్న పెండింగ్ పనులు పూర్తి కావాలంటే జగన్ కావాలని విద్యార్థులకు మంచి భవిష్యత్తు కావాలంటే జగన్ కావాలని మహిళలు మరింత ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే జగన్ కావాలని ఆయన అన్నారు. అన్ని ప్రాంతాల అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్ లక్ష్యం అన్నారు. 2024లో తిరిగి జగన్ ముఖ్యమంత్రి చేయవలసిన ఆవశ్యకత రాష్ట్రానికి చాలా అవసరమని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీహరి నారాయణరాజు, జెడ్పిటిసి కనకదుర్గ మహంకాళి, మండల పార్టీ అధ్యక్షుడు ఆంజనేయరాజు తదితర నాయకులు, కార్యకర్తలు, అధికారులు, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

విశాలాంధ్ర-ఉండి: ఉండి గ్రామానికి చెందిన అయికా చల్లయ్య(80) శనివారం రాత్రి ఎన్ ఆర్ పి అగ్రహారం చర్చి వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనగా తలకు తీవ్ర గాయాలై మృతి చెందాడు. ఆదివారం కేసు నమోదైనట్లు ఏఎస్ఐ ఆకురాతి సూర్యనారాయణ తెలిపారు.

అమ్మవారి రవికలు, చీరలు వేలం

విశాలాంధ్ర-పెనుగొండ: శ్రీనగరేశ్వర మహిషాసుర మర్దిని శ్రీవాసవి కన్యకపర మేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు చీరలు రవికలు సోమవారం దేవస్థానం ఆవరణలో బహిరంగ వేలం జరిగింది.ఈ వేలం కార్యక్ర మంలో భక్తులు,ప్రజలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ముంపు పొలాలను పరిశీలించిన నాయకులు

విశాలాంధ్ర-ఆచంట: మిచౌంగ్ తుఫాన్ ధాటికి పడిపోయిన వరి పొలాలను ఆచంటవేమవరం గ్రామ సర్పంచ్ జక్కంశెట్టి చంటి,ఉప సర్పంచ్ కొండేటి సురేష్ బాబు పరిశీలించారు.ఈ కార్యక్రమంలో నాయకులు గ్రామ రైతులు పాల్గొన్నారు.

తుపాను బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ

విశాలాంధ్ర-ఉండి: తుపాను బాధితులకు ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని డిసిసిబి చైర్మన్, ఉండి వైకాపా ఇన్‌చార్జి పివిఎల్ నరసింహరాజు అన్నారు. సోమవారం ఉండి మండలం చెరుకువాడ గ్రామంలో గ్రామ సర్పంచ్ కొండవీటి సాంబశివరావు (శివయ్య) అధ్యక్షతన సుమారు 30 మంది తుఫాను బాధితులకు 25 కేజీల బియ్యం బస్తా, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీహరి నారాయణరాజు, బందెల ప్రమీల జార్జి, కొర్రపాటి అనిత తదితర నాయకులు కార్యకర్తలు, అధికారులు, బాధితులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర పోటీలను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-భీమవరం: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను విజయవంతం చేయడానికి సంబంధిత అధికారులు కృషి చేయా లని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. రామ్ సుందర్ రెడ్డి ఆదేశించారు. స్థానిక జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై సంబంధిత డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో క్రీడాకారుల బృందాలను ఇంకా పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయకపోవడం పట్ల వీరవాసరం, ఇరగవరం మండల ఎంపీడీవోలు, భీమవరం, నరసా పురం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు మున్సిపల్ కమిషనర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి సచివాలయంకు సుమారు 400 చొప్పున ఆడియెన్స్ రిజిస్ట్రేషన్ కూడా పూర్తి పూర్తిచేయాలని తెలిపారు. ఆటలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా క్రీడా మైదానాలను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ రామ సుందర్ రెడ్డి ఆదేశించారు.ఈ సమీక్షలో డి ఎల్ డి ఓ కె సిహెచ్ అప్పారావు, జిల్లా పంచాయతీ రాజ్ శాఖ అధికారి, జీవీకే మల్లికార్జునరావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె మురళీకృష్ణ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే గ్రంధి

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : భీమవరం నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. సోమవారం పట్టణంలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ముందుగా 36వ వార్డు ఎమ్మార్ నగరంలో రూ. 16 లక్షలతో చేపట్టనున్న సిసి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం 37వ వార్డు యాదవుల వారి వీధిలో రూ.40 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణానికి, 34 వ వార్డులో పళ్ళ వారి వీధిలో రూ. 22 లక్షల నిధులతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాలలో టు టౌన్ జె.సి.యస్ గాదిరాజు సుబ్రహ్మణ్యం రాజు,ఏఎం సి చైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

గర్భిణీలు ప్రభుత్వాసుపత్రిలో పురుడు పోసుకోవాలి

విశాలాంధ్ర - గణపవరం: ప్రతి గర్భిణీ స్త్రీ ప్రభుత్వ ఆసుపత్రిలో పురుడు పోసుకోవాలని, గణప వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ పీహెచ్ఎన్ సంతోష్ నాయుడు, డాక్టర్ పి. కిరణ్మయి అన్నారు. సోమవారం పి హెచ్ సి లో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. మొదటి ,రెండవ గర్భిణీ స్త్రీలను వైద్య అధికారులు 76 మందిని పరీక్షించి వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ జె. విల్సన్ బాబు, ఏఎన్ఎంలు, హెచ్విఎస్, ఆరోగ్య సహాయకులు ఎం. నల్లయ్య ,ఎం ఎస్ యోహన్, శ్రీనివాస్, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాల్గొన్నారు. అనంతరం వారికి భోజన సదుపాయం ఏర్పాటు చేశారు.

నాదెండ్ల అరెస్టు అప్రజాస్వామ్యం

విశాలాంధ్ర -భీమవరం: టైకూన్ జంక్షన్ ను మూసి వేసి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుంటే నిరసన తెలిపి, ఆ కూడలిని తెరవాలని కోరినందుకు జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ ను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జనసేన అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు విమర్శించారు. సోమవారం భీమవరంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకున్న సమస్యలను తీర్చాల్సిన మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, పోలీసులు అధికారులు అధికార పార్టీకి కొమ్ము కాయడం దారుణమని నిప్పులు చెరిగారు. టైకూన్ జంక్షన్ ను తెరచి ప్రజలకు అందుబాటులో కి తీసుకురాని పక్షంలో 'ఛలో వైజాగ్' కార్యక్రమం చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పొలిట్ బ్యూరో సభ్యులు కనకరాజు సూరి, పట్టణ అధ్యక్షులు చెనమల్ల చంద్రశేఖర్,పట్టణ ప్రధాన కార్యదర్శి సుంకర రవి, వీరవాసరం మండల అధ్యక్షులు పుప్పాల బాలాజి, భీమవరం మండల అధ్యక్షులు మోకా శ్రీనివాస్, బండి రమేష్, రామాయణం శ్రీనివాస్, రెడ్డి సత్తిబాబు, త్రివిక్రమ్,అరుగోలను పద్మ, ఉదిసి మీనాక్షి, కట్రెడ్డి రాము , పద్మారావు, నాగిడి శ్రీనివాస్, గిరి ,పెద్దేటీ తేజ, మగాపు భగత్ సింగ్, కాళీ శేఖర్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పోతనపల్లిలో క్రికెట్ కిట్ పంపిణీ

విశాలాంధ్ర - చాట్రాయి : పోతనపల్లిలో గిరిజన యువకులకు నూజివీడు మాజీ శాసనసభ్యులు చిన్నం రామకోటయ్య క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. చాట్రాయి మండలం పోతనపల్లి గ్రామంలో సోమవారం నూజివీడు మాజీ శాసనసభ్యులు చిన్నం రామకోటయ్య అనుచరుడు దారా సుందర్ చేతుల మీదుగా క్రికెట్ కళాకారులకు కిట్టు పంపిణీ చేశారు. మోహన్ నాయక్ సతీష్ శ్రీనాథ్ పండూ సిద్దు కృష్ణ ప్రసాద్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

విశాలాంధ్ర - లింగపాలెం : ఓటు హక్కును పవిత్రంగా భావించి సమాజానికి ఉపయోగపడే నాయకులను ఎన్నుకోవాలని తహశీల్దార్ ఆర్.వి. మురళీకృష్ణ తెలిపారు. ఎంపిడిఓ ఆశీర్వాదం ఓటు హక్కుపై ధర్మాజీగూడెం శ్రీప్రతిభ కాలేజి విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై విద్యార్థులకు, యువతకు అవగాహన ఉండాలన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరు ఓటును నమోదుచేసుకోవాలని తెలిపారు. ఓటును నమోదు చేసుకుని దానిని వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రదర్శన చేశారు.

పంటలు దెబ్బతిన్న రైతులకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర - లింగపాలెం : మిర్చి, పత్తి పంటలకూ తుఫాను వల్ల తీవ్ర నష్టం వాటిల్లిందని, పూర్తి స్థాయిలో నష్టం వాటిల్లిన రైతులను గుర్తించి వారికి పరిహారం అందించే చర్యలు తీసుకోవాలని ధర్మాజీగూడెం, కె.గోకవరం ఎంపిటిసిలు ఎం.రాజ్యలక్ష్మి, సి.జయరాజు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికారులను కోరారు. లింగపాలెం మండల పరిషత్ సమావేశం మండల పరిషత్ అధ్యక్షురాలు ముసునూరు వెంకటలక్ష్మి అధ్యక్షతన సోమవారం జరిగింది. సమావేశంలో తుపాను వల్ల పంటల నష్టం, రహదారుల దుస్థితిపై చర్చ జరిగింది. సభ్యుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని వ్యవసాయాధికారి మురళీకృష్ణ, ఉద్యానవన శాఖాధికారి షాఫియా పర్వీన్ సమాధానాలు ఇచ్చారు. సమావేశంలో ఎంపిడిఓ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మట్టా సురేష్, ఆశీర్వాదం, మండల పరిషత్ పరిపాలన అధికారి మణికుమారి, తహశీల్దార్ ఆర్.వి.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రంగప్రసాద్‌కు కళా ప్రపూర్ణ జాతీయ పురస్కారం

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో విజయవాడలో ఆదివారం జరిగిన జాతీయ సాంస్కృతిక సంగీత సాహిత్య నృత్య సమ్మేళనం -2023లో మండలానికి చెందిన శ్రీమద్ది అంజనేయ స్వామివారి దేవస్థానం అర్చకులు వేదాంతం వెంకట శేష రంగ ప్రసాద్ తెలుగు వెలుగు విశిష్ట కళా ప్రపూర్ణ జాతీయ పురస్కారం అందుకున్నారు. జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెంకు చెందిన వేదాంతం వెంకట శేష రంగ ప్రసాద్ జోతిష్యం, వాస్తు శాస్త్రములలో విశిష్టమైన కృషి చేసినందుకు గాను తెలుగు వెలుగు విశిష్ట కళా ప్రపూర్ణ జాతీయ పురస్కారం విజయవాడ బాలోత్సవ్ భవన్ లో జరిగిన కార్యక్రమంలో విశ్వకళా విరాట్ డాక్టర్ వంగాల శాంతి కృష్ణ ఆచార్య, విశ్రాంత ఐ.ఎ.ఎస్ అధికారి మనేపల్లి సుబ్రహ్మణ్యం, సీనియర్ ఐపీఎస్ అధికారి ద్వారకా తిరుమలరావు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చందు సాంబ శివరావు, తదితరుల చేతుల మీదుగా పురస్కారం ప్రదానం చేసినట్లు తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక చైర్మన్ పోలోజు రాజ్ కుమార్ చార్యులు, జాతీయ కన్వీనర్లు డాక్టర్ రంగిశెట్టి రమేష్, డాక్టర్ వలబోజు మోహన్ రావు తెలిపారు. పలువురు మేధావులు, పెద్దలు పురస్కార గ్రహీత వేదాంతం వెంకట శేష రంగ ప్రసాద్ ను ప్రత్యేకంగా అభినందించారు.

అంబేద్కర్ ఇండియా మిషన్ సమావేశం

విశాలాంధ్ర-మొగల్తూరు: మన వాడ మన పంచాయతీ అభివృద్ధి పథంలో మనం నినాదంతో పని చేస్తున్న అంబేద్కర్ ఇండియా మిషన్‌కు ప్రజలు మద్దతు పలకాలని అంబేద్కర్ ఇండియా మిషన్ జిల్లా అధ్యక్షుడు బి.వి.రత్నం అన్నారు. మొగల్తూరు మండలం రామన్నపాలెం పిట్టావారి పేట గ్రామంలో మొగల్తూరు మండల కన్వీనర్ ఇంజేటి రాజు అధ్యక్షతన ఆదివారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేద్కర్ ఆశయ సాధనకు ఎయిమ్ వ్యవస్థాపకులు పి.వి.సునీల్ కుమార్ ఐ.పి. యస్ కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్ జిల్లా కన్వీనర్ డి. యన్.రాజు,స్థానిక గ్రామ సర్పంచ్ బందెల ఎలీషా, మొగల్తూరు సర్పంచ్ పడవల సత్యనారాయణ, ఎయిమ్ నాయకులు మేడిది శ్యామ్, నరసాపురం నియోజకవర్గ నాయకులు మోకా సర్జన్ రావు, పాకెర్ల కిరణ్, బాబీ, కొల్లాబత్తుల నానిబాబు, కోనాల ప్రసాదరావు, కత్తిమండ రత్నంరాజు, స్థానిక సంఘ పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు.

దళిత రైతుల గోడు పట్టదా

విశాలాంధ్ర - జగ్గంపేట : దళిత ప్రభుత్వం అని చెప్పుకుంటున్న ఈ ప్రభుత్వానికి దళితుల గోడు పట్టదా అని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు ప్రశ్నించారు. జగ్గంపేట మండలం గుర్రంపాలెం పంచాయతీ పరిధిలోని భలబద్రపురం సీలింగ్ భూమిని సాగు చేసుకుంటున్న వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రైతు కూలీ సంఘం అధ్వర్యంలో గత 15 రోజులుగా దళిత రైతులు రిలే నిరహారదీక్షలు చేస్తున్నారు. ఎవ్వరూ స్పందించకపోవడంతో తహశీల్దార్ కార్యాలయాన్ని సోమవారం ఆయన దళిత రైతులతో కలిసి ముట్టడించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద వంటా వార్పు నిర్వహించి నిరసన చేపట్టారు. అనంతరం జగ్గంపేట మెయిన్ రోడ్డులో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సంధర్భంగా కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా దళితులు సీలింగ్ భూమిలో ఉన్న తుప్పలను తొలగించి సాగు చేసుకుంటున్నారన్నారు. ఇప్పటి వరకూ ఎన్ని ప్రభుత్వాలు మారిన ఆభూమి గురించి ఎవరూ పట్టించుకోలేదన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ భూమిపై వైసిపి కార్యకర్తలు కన్ను పడిందన్నారు. ఆ భూమికి సాగు దారులకు పట్టాలు ఇవ్వకుండా ఎమ్మెల్యే అనుచరులకు పట్టాలు ఇచ్చే విధంగా అధికారులు ప్రపోజల్ పంపించారన్నారు. వారికి పట్టాలు ఇచ్చే ప్రయత్నం జరుగుతుందని ఆయన ఆరోపించారు. ఎమ్మెల్యే చెప్పిన వారి పేర్లు పంపిన తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు కూలి సంఘం జిల్లా కార్యదర్శి బి రమేష్, తదితర రైతు కూలి సంఘం నాయకులు, దళిత రైతులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై చర్చ

విశాలాంధ్ర -పెరవలి: అధికారులు నాయకులను సమన్వయం చేసుకుని విధులు నిర్వహించాలని మండల పరిషత్ అధ్యక్షులు సీతారామ్ ప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సర్వసభ్య సమావేశం జరిగింది.ఈసందర్భంగా పలు శాఖల అధికారులు ఆఆయా శాఖలకు చెందిన ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈసందర్భంగా మండల అధ్యక్షులు మాట్లాడుతూ అధికారులు నాయకులను సమన్వయం చేసుకుని విధులు నిర్వహించా లని దాని ద్వారా లబ్ధిదారులకు సక్రమంగా ప్రభుత్వ పథకాలు అందుతాయని అన్నారు. మండలంలోని కాపవరం గ్రామానికి చెందిన యంపిటిసికి ఏవిధమైన సమాచారం తెలియచేయడం లేదని విమర్శించారు. ఈకార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

గల్ఫ్ యువనేస్తం సేవాసమితి సేవలు అభినందనీయం

విశాలాంధ్ర - రాజోలు : ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ గల్ఫ్ యువనేస్తం సేవాసమితి సభ్యులు చేస్తున్న సేవలు అభినందనీయం అని ఎ1 సేవా సమితి అధ్యక్షులు చెల్లుబోయిన శ్రీనివాస్ అన్నారు. మలికిపురం మండలం విశేశ్వరాయపురం తోటమెరక ప్రాంతానికి చెందిన దొంగ ఈశ్వర్ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంది. విషయం తెలుసుకున్న గల్ఫ్ యువనేస్తం సేవాసమితి సేవలు సోమవారం ఆ కుటుంబానికి ఎ1 సేవా సమితి అధ్యక్షులు చెల్లుబోయిన శ్రీనివాస్, చెల్లుబోయిన హరిక్రిష్ణ చేతులమీదుగా రూ. 20,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రూపు సభ్యులు గుబ్బల గోవర్ధనపద్మకుమారి, కడలి క్రిష్ణార్జునులు, కట్టా వాసు, నాని, మనోజ్, సుబ్రమణ్యం, సురేష్, ప్రసాద్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పిడిఎస్ బియ్యం పట్టివేత

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లాలోని యు కొత్తపల్లి మండలంలోని వాకతిప్ప గ్రామంలోని ఒక్క ఇంటి నందు బియ్యం అక్రమ నిల్వకు సంబంధించిన విశ్వసనీయ సమాచారం పై సోమవారం మా బృందం విజిలెన్స్ అధికారులు, రెవెన్యూ మరియు సివిల్ సప్లయ్స్ అధికారులతో కలిసి సదరు ఇంటిని తనిఖీ చేయగా 24 బ్యాగ్ లలో సుమారు 1006 కేజీల పిడిఎస్ బియ్యంను గుర్తించారు. సదరు పిడిఎస్(చౌక బియ్యం) గోట ధర్మరాజు వారికి చెందినది. గోట ధర్మరాజు టూవీలర్ వాహనముపై 50 కేజీల పిడిఎస్ బియ్యాన్ని రవాణా చేస్తున్నారు. బియ్యాన్ని కిలో ఒక్కింటికి రూ.18 లకు పరిసర ప్రాంతాల కార్డుదారుల కొనుగోలు చేసి రూ. 20 లకు ఉప్పాడలోని మత్స్యకారులకు విక్రయిస్తున్నారు. సదరు బియ్యంకు సంబంధించి ఎటువంటి బిల్లులు లేనందున సివిల్ సప్లయ్స్ అధికారులు, యు కొత్తపల్లి వారు సుమారు రూ 80,240 లు విలువ గల సుమారు 1006 కేజీల పిడిఎస్(చౌక బియ్యం)ను సీజ్ చేసి 6-ఏ క్రింద కేసు నమోదు చేసి, పిడిఎస్ బియ్యాన్ని అక్రమ నిల్వ గోట ధర్మరాజు పై క్రిమినల్ కేసు నమోదు కొరకు పోలీసు స్టేషన్‌కు సిఫారసు చేయటమైనది. ఈ సందర్భముగా ఇంచార్జ్ రీజనల్ విజిలెన్స్ & ఎన్ఫోర్స్మెంట్ అధికారి ఎ సురేష్ బాబు మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్ & ఎన్ఫోర్స్మెంట్ పరిధిలోని మూడు జిల్లాలలో పిడిఎస్(చౌక బియ్యం) అక్రమ నిల్వలు, అక్రమ రవాణా పై నిరంతరం నిఘా కొనసాగుతుందన్నారు. తనిఖీలలో కార్యాలయ సబ్-ఇన్స్పెక్టర్ జగన్నాధరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ జీవానందం, కానిస్టేబుల్ లోవకుమార్, రెవెన్యూ, సివిల్ సప్లయ్స్ అధికారులు పాల్గొన్నారు.

జగన్‌ను గెలిపిస్తేనే రాష్ట్రం మరింత అభివృద్ధి

విశాలాంధ్ర - పెద్దాపురం : రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్రెడ్డిని మరొక్కసారి గెలిపిస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ఏపీ హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని వాలుతిమ్మాపురం గ్రామంలో సోమవారం 'వై ఏపీ నీడ్ జగన్'' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గృహ సారదుల మండల కన్వీనర్ గోపు మురళి అధ్యక్షతన జరిగిన సమావేశంలో హౌసింగ్ చైర్మన్ దొరబాబు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు అదనంగా పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి నాలుగున్నరేళ్ల కాలంలో రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి లబ్ధి చేకూరేలే సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్మోహన్రెడ్డికే దక్కుతుందున్నారు. ప్రజలకు నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధి ప్రతీ ఒక్కరూ గుర్తించి రెండవ దఫా వైఎస్సార్ సీపీ విజయానికి నాంది పలకాలని ఆయన కోరారు. రెండవ సారి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజలకు మరింత లబ్ధి చేకూరుతుందని దొరబాబు అన్నారు. అనంతరం ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు ప్రజలకు జరిగిన సంక్షేమం. అభివద్ధిపై వివరించారు. తొలుత పార్టీ జెండా, సంక్షేమం. అభివద్ధి బోర్డును దొరబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, ఎంపీటీసీ రాయి వెంకటేశ్వరరావు, సర్పంచ్ కంచుమర్తి శ్రీనివాస్, బచ్చల రాజు, పురందాసు అన్నవరం. ఫరందాసు చినరాజు, గోలి రామారావు, సుందరెడ్డి రాజు, లక్కాకుల కృష్ణ, రాంపండు, పంచాయతీ కార్యదర్శి వరసాల శ్రీనివాసరావు. సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

విశాలాంధ్ర - ఐ పోలవరం : నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరేశ్వర స్వామి వారి ఆలయంలో కార్తీక మాసం ఆఖరు సోమవారం భక్తుల శివనామస్మరణతో మారుమోగింది. అర్చకులు బ్రహ్మశ్రీ యనమండ్ర సుబ్బారావు ఆధ్వర్యంలో భక్తులకు దర్శనాలు అందించారు. పురోహితులు బ్రహ్మశ్రీ నాగాభట్ల రామకృష్ణ మూర్తి ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుండి భక్తులు ఆలయానికి విచ్చేసి 283 పంచామృతాభిషేకాలు, 456 నిత్యాభిషేకాలు నిర్వహించారు. సుమారు 6 వేలకు పైన భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. అనంతరం నలమాటి అవినాష్ చౌదరి, జితేష్ చౌదరి ఆర్థిక సహాయంతో భక్తులకు అన్న ప్రసాదం జరిపారు.

ఆధ్యాత్మిక నగరంగా కాకినాడ

విశాలాంధ్ర - కాకినాడ : ఆధ్యాత్మిక నగరంగా కాకినాడ రాబోయే తరంలో కూడా విరాజిల్లుతుందని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. శ్రీ పీఠంలో శతకోటి కుంకుమార్చన కార్యక్రమం మహా యాగంలో భాగంగా 28వ రోజు కార్తీక మాసం ఆఖరి సోమవారం కావడంతో భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఈ కుంకుమార్చన శివుని పంచామృత అభిషేక కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నబాబు వారి తండ్రి రూరల్ డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ సోదరుడు సినీ డైరెక్టర్ కళ్యాణ్ కృష్ణ కుటుంబ సమేతంగా నాలుగో రోజు సాంప్రదాయ దుస్తులు ధరించి స్వామివారికి ప్రత్యేక అభిషేకం చేశారు. స్వామి పరిపూర్ణానంద సరస్వతి స్వామీజీ ఆధ్వర్యంలో పరమశివునికి పంచామృత అభిషేకం చేశారు. బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు సందేశం భక్తులకు ఎంతగానో అలరించాయి. ఈ సందర్భంగా మీడియాతో సినీ డైరెక్టర్ కళ్యాణ్ కృష్ణ మాట్లాడుతూ 100 కోట్ల కుంకుమార్చన ఈ ప్రాంతంలో నిర్వహించడం కాకినాడ ప్రజలు చేసుకున్న అదృష్టం అన్నారు.

పర్యావరణ పరిరక్షణ సమిష్టి బాధ్యత

- జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-నూజివీడు : పర్యావరణ పరిరక్షణ మనందరి సమిష్టి బాధ్యత అని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా నూజివీడు మండలం బత్తులవారిగూడెంలో సామాజిక వనవిభాగం ఆధ్వర్యంలో నగరవనంలో ఏర్పాటుచేసిన కార్తీక వన మహోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ప్రకృతిని ప్రేమించటం, ప్రకృతితో కలిసి జీవించటం జీవన విధానంలో ఒక భాగం చేసుకోవాలన్నారు. అప్పుడే పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందన్నారు. ప్రతీ వ్యక్తి పుట్టిన రోజు, పెళ్లి రోజు వంటి ప్రముఖ రోజులలో ఒక చెట్టును నాటే సంప్రదాయాన్ని అలవాటుగా చేసుకోవాలన్నారు. పిల్లలకు చిన్నతనం నుండే అభిరుచిగా చేయాలన్నారు. ప్రకృతికి మనిషికి విడదీలేని అనుబంధం ఉందన్నారు. అయినప్పటికీ మానవుడు చేసే కొన్ని చర్యలతో పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందని, దీనివల్ల నీటికొరత, నదులు ఎండిపోవడం, కాలుష్యం పెరగడం లాంటి ప్రతికూల పరిస్థితులు ఏర్పడుతున్నాయని, వీటివల్ల మానవజాతి మనుగడకు ముప్పు ఏర్పడుతుందన్నారు. జాయింట్ కలెక్టర్ బి. లావణ్య వేణి, ఐ టి డి ఏ ప్రాజెక్ట్ అధికారి సూర్య తేజ, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, అసిస్టెంట్ కలెక్టర్ శ్రీపూజ జిల్లా అటవీశాఖాధికారి రవీంద్ర దామా, సామాజిక వనాల అధికారి హిమ శైలజ, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో జాయింట్ డైరెక్టర్ నక్కా సూర్యచంద్రరావు, డి పీ ఓ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్, గృహ నిర్మాణ శాఖ పీడీ కే. రవికుమార్, ఇరిగేషన్, ట్రాన్స్కో పంచాయతీ రాజ్ ఎస్. ఈ లు శ్రీనివాసరావు, సాల్మన్ రాజు, కేదారేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి వై. రామకృష్ణ, డ్వామా పీడీ రాము, డి ఈ ఓ శ్యాంసుందర్, పశుసంవర్ధక శాఖ జేడి నెహ్రూ బాబు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖధికారి డా. శర్మిష్ఠ, తహసీల్దార్ ఎల్లారావు, ప్రభృతులు పాల్గొన్నారు.

ఏలూరు నగర స్థాయి స్కూల్ చెస్ టోర్నమెంట్

విశాలాంధ్ర - ఏలూరు: స్థానిక సత్రంపాడు లోని ఆదిత్య కిడ్స్ చెస్ క్లబ్ లో ఏలూరు నగర స్థాయి చెస్ పోటీలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చెస్ అసోసియేషన్ ఆఫ్ హేలాపురి అధ్యక్షులు గంజి యోహాన్ హాజరై చదరంగం ద్వారా విద్యార్థిని విద్యార్థులకు సుమారు 50 రకాల ప్రయోజనాలు ఉన్నాయని సూచించారు. అందరూ చెస్ నేర్చుకునే విధంగా విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థి దశ నుంచే వారి పిల్లలను ప్రోత్సహించాలన్నారు. ప్రస్తుతం అభ్యసించే పిల్లలకు మరింత ప్రోత్సాహాన్ని అందించాలన్నారు. అనంతరం గెలుపొందిన విజేతలు జి అభిషేక్ అబ్రహమ్ ప్రథమ, జి అనురూఫ్ మోషే ద్వితీయ, బాలికలు ఎస్ లేటోనా రాజ్ ప్రథమ, కె చోక్షిత తృతీయ బహుమతులు అందుకున్నట్లు అబ్రహం అండ్ గ్యారి సంస్థ అకాడమీ డైరెక్టర్ గంజి యోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య చెస్ కిడ్స్ క్లబ్ డైరెక్టర్ వి.రత్న కిషోర్, ప్రిన్సిపల్ వి. శరణ్య, చెస్ కోచ్ శ్యామల, ప్రొఫెసర్ కిరణ్మయి, తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

సీనియర్ రెసిడెంట్ (డాక్టర్స్) నియామకానికి ఇంటర్వ్యూ

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ :రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాలలో సీనియర్ రెసిడెంట్ (డాక్టర్స్) నియామకాలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూస్ డిసెంబర్ 13 వ తేదీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్/అడిషనల్ డి.ఎం. ఈ., డాక్టర్ బి. సౌభాగ్యలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.కొత్తగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్య కళాశాల రాజమహేంద్రవరం నందు సీనియర్ రెసిడెంట్ (డాక్టర్స్) నియామకానికి 13వ తేదీ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ప్రిన్సిపాల్ కార్యాలయంలో 48 పోస్టులకు సంబంధించి సీనియర్ రెసిడెంట్స్ ఖాళీలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు జరుపనున్నట్లు , హాజరయ్యే అభ్యర్థులు రుసుము కింద ప్రిన్సిపల్ కాలేజ్ డెవలప్మెంట్ సొసైటీ రాజమహేంద్రవరం పేరు మీద రూ. 1000 ల డిమాండ్ డ్రాఫ్టును సమర్పించాలన్నారు.